Eenadu D-28/06/15

# ● పాతనగరంలో మెట్రోరైలు పనులు చేపట్టాలని వినతి



హెచ్.ఎం.ఆర్. ఎండీకి వినతిపత్రం అందిస్తున్న కృష్ణాయాదవ్ తదితరులు

**హిమాయత్‌నగర్:** మెట్రో పనులను పాతనగరంలో ఇంకా మొదలు పెట్టకపోవడం వల్ల ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని, ఇప్పటికైనా నిర్మాణం చేపట్టాలని తెదేపా విజ్ఞప్తి చేసింది. శనివారం ఈ మేరకు తెదేపా నగర అధ్యక్షుడు కృష్ణా యాదవ్ నేతృత్వంలో హైదరాబాద్ మెట్రోరైలు (హెచ్.ఎం.ఆర్.) ఎండీ ఎన్.వి.ఎస్. రెడ్డికి వినతిపత్రం అందజేశారు. పార్టీ నగర అధికార ప్రతినిధి ఆనంద్‌కుమార్‌గౌడ్, కార్యదర్శి నైశథం సత్యనారాయణమూర్తి తదితరులతో కలిసి హెచ్.ఎం.ఆర్. ఎండీని కలిశారు. పాతనగరానికి చెందిన పౌరులు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తరచూ పాతనగరం కారిడార్ మార్గాన్ని సవరిస్తుండడం వల్ల ప్రజల్లో అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు.

Sakshi Dt 28/06/15

# పాతబస్తీపై పక్షపాతం వద్దు

- వెంటనే మెట్రోపనులు చేపట్టండి
- మెట్రోరైలు ఎండీకి టీడీపీ వినతి

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలో హైదరాబాద్ మెట్రో రైలు పనుల్ని వెంటనే ప్రారంభించాలని హైదరాబాద్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు సి.కృష్ణయాదవ్ మెట్రోరైలు ఎండీ ఎన్వీఎస్‌రెడ్డిని కోరారు. ఈమేరకు శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు. నిత్యం రెండు లక్షల మంది వివిధ పనుల నిమిత్తం పాతబస్తీనుంచి కొత్తసిటీకి వస్తుంటారని, మెట్రోరైలు అందుబాటులోకి వస్తే తమ రవాణా బాధలు తప్పుతాయని ఆశ పడ్డ వారి ఆశలు అడియాసలయ్యాయన్నారు. సీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు (వయా మీరాలంమండి, శాలిబండ) ఒక్క పిల్లర్ కూడా వేయకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. కొందరు రాజకీయ నాయకులు వారి స్వప్రయోజనాల కోసం పాత అలైన్‌మెంట్‌కు అడ్డుపడుతున్నారని, ప్రజాసదుపాయం దృష్ట్యా అందరికీ ఉపయుక్తమైన ఆ మార్గంలోనే మెట్రో పనులు చేపట్టాలని కోరారు. మెట్రోరైలు, ఎల్ అండ్ టీ అధికారులు ఈ విషయంలో శ్రద్ధ చూపాలని, పాతబస్తీ ప్రజలపై పక్షపాతం వహించరాదని కోరారు. తమ కోర్కెను మన్నించి వెంటనే పాతబస్తీలో మెట్రోరైలు పనులు చేపట్టాలన్నారు. మెట్రోరైలు ఎండీని కలిసిన వారిలో పార్టీ అధికార ప్రతినిధి ఎం.ఆనంద్ కుమార్‌గౌడ్, నైషధం సత్యనారాయణ మూర్తి, శ్రీశైలంయాదవ్, బాల్‌రాజ్‌గౌడ్, రాములు తదితరులున్నారు.



ఎన్వీఎస్ రెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న కృష్ణయాదవ్ తదితరులు